తల్లిదండ్రులు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలి

అడ్డగుట్ట: ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయశ్రీ, అడ్డగుట్ట యూపీహెచ్‌సీ ఇన్‌చార్జి డాక్టర్ వీరు కాసర్ల సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం వారు మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆయా ప్రాంతాల్లో 32 పోలియో సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు స్థానిక సెంటర్లలో పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. వివిధ కారణాలతో ఆదివారం పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లల కోసం సోమవారం, మంగళవారం, బుధవారం మూడు రోజులు డోర్ టూ డోర్ సర్వే నిర్వహించి పోలియో చుక్కలు వేయనున్నట్లు తెలిపారు.

బీసీలకు ద్రోహం

అడ్డగుట్ట: బీసీల న్యాయబద్ధమైన 42 శాతం రిజర్వేషన్లను బీజేపీ అడ్డుకుంటూ బీసీలకు ద్రోహం చేస్తుందని సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి శ్రీనివాస్ మండిపడ్డారు. శుక్రవారం అడ్డగుట్టలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు బీజేపీ కట్టుబడి ఉందని ఒక వైపు మాట్లాడుతూనే, మరోవైపు కోర్టులో కేసులు వేస్తోందని ఆరోపించారు.సమావేశంలో సీపీఐ సికింద్రాబాద్ నాయకులు బాబు, గౌరీ నాగరాజ్, యాదగిరి, సత్యనారాయణ, కొండల్, శ్రీనివాస్, సుదర్శన్, నాగ భూషణం, రమేశ్ తదితరులున్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడిగా రాజేశ్



లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీ నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నూతన అధ్యక్షుడిగా యారాల రాజేశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం సాయంత్రం ఓయూ సైన్స్ కాలేజీ ఆవరణలో కాంట్రాక్ట్ ఉద్యోగుల జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలోనే రాజేశ్‌ను కాంట్రాక్ట్ ఉద్యోగులందరూ ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. శుక్రవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో పూర్తిస్థాయి నూతన కమిటీని ఏర్పాటు చేసి, సంఘాన్ని బలోపేతం చేస్తామన్నారు. ఉద్యోగుల సమస్యలు, క్రమబద్ధీకరణ, వేతన సవరణ, ఉద్యోగ భద్రత ఇతర ప్రయోజనాల కోసం కృషి చేస్తామన్నారు.

ఏసీబీకి పట్టుబడ్డ సబ్ ఇంజినీర్ సుధాకర్‌రెడ్డి



లాలాపేట: టీజీఎస్‌పీడీసీఎల్ లాలాగూడ సబ్ ఇంజినీర్ సింగిల్ ఫేజ్‌ను త్రీ ఫేజ్‌గా అప్‌గ్రేడ్ చేయడానికి రూ. 15 వేలు లంచం తీసుకుంటుండగా శుక్రవారం తార్నాకలోని తన కార్యాలయంలో ఏసీబీ సిటీ రేంజ్ యూనిట్–2 అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. సికింద్రాబాద్ పద్మారావునగర్ సబ్‌డివిజన్‌లోని లాలాగూడ సెక్షన్ సబ్ ఇంజినీర్ భూమిరెడ్డి సుధాకర్‌రెడ్డి కొంత కాలంగా ఇన్‌చార్జి అసిస్టెంట్ ఇంజినీర్‌గా కొనసాగుతున్నారు. కాగా తుకారంగేటు ప్రాంతంలో కేవలం 8 మీటర్ల దూరం సింగిల్ ఫేజ్ మీటర్ల నుంచి త్రీ ఫేజ్ మీటర్లకు అప్‌గ్రేడ్ చేయడానికి, ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయడానికి ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్ నుంచి మొదటి విడతగా రూ. 15 వేలు డిమాండ్ చేశాడు. దీనికి సంబంధించిన ట్రాన్స్‌పార్మర్ మంజూరు పత్రాన్ని తన కార్యాలయంలోనే ఫిర్యాదుదారుకు అందజేశాడు. డబ్బులను అక్కడ తీసుకోకుండా ఆ మొత్తాన్ని సదరు ఫిర్యాదుదారు నుంచి తార్నాక సన్మాన్ హోటల్‌లో స్వీకరిస్తుండగా అప్పటికే అక్కడ ఉన్న ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి లంచం నగదును స్వాధీనం చేసుకుని అతన్ని అరెస్టు చేశారు.

ఎస్‌ఆర్‌నగర్‌లో ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు




అమీర్‌పేట: ఎస్‌ఆర్‌నగర్‌లో రోడ్లపై వెలిసిన ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం ఎస్‌ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ నుంచి బీకేగూడ మున్సిపాల్ వార్డు కార్యాలయం వరకు వెలసిన ఆక్రమణలు తీసేశారు. చాలా చోట్ల రోడ్డుకు ఇరువైపులా టీ స్టాల్స్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, ఛాట్ బండార్ కొట్లు ఉన్న కారణంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో పాటు పాదా చారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్థానిక కాలనీ అసోసియేషన్ పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేశారు. ఎట్ట కేలకు స్పందించిన ట్రాఫిక్ పోలీసులు వాటిని తొలగించారు. ఇదే రోడ్డు మార్గంలో మూడు హోటల్స్ ఉన్నప్పటికీ పార్కింగ్ సౌకర్యం లేని కారణంగా హోటల్స్‌కు వచ్చే వారు వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారని, వాటి విషయంలో చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణం నిత్యం నరకం



మురుగు, వర్షపునీరు నిలవడంతో ధ్వంసమైన ఒలిఫెంటా వంతెన మార్గం

- వంతెన దాటేందుకు సర్కస్ ఫీట్లు
- రెండు మార్గాల్లో మురుగు, వరద నీటి నిల్వలు
- గంటల తరబడి ట్రాఫిక్ సమస్యలు
- పట్టించుకోని అధికారులు
- సికింద్రాబాద్ ఒలిఫెంటా దుస్థితి



వంతెన మార్గాలు ప్రమాదకరంగా మారడంతో సంగీత్ మార్గంలో బారులు తీరిన వాహనాలు

సికింద్రాబాద్: నగరంలో అత్యధిక వాహనాల రద్దీ కలిగిన వంతెన ఇది. ఈ వంతెన దాటడం కోసం వాహనదారులు నిత్యం సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తుంది. వంతెనకు ఉన్న రెండు మార్గాల్లో మురుగు, వరద నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్రంగా అంతరాయాలు ఏర్పడుతున్నాయి. వరద, మురుగుకు తోడుగా వంతెన రెండు మార్గాలు గుంతలమయం కావడంతో ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతున్నాయి.

◆ నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే సికింద్రాబాద్ రైల్వేరిజర్వేషన్ కార్యాలయం ముందున్న ఒలిఫెంటా వంతెన వాహన దారులకు నిత్యం నరకం చూపిస్తుంది. వంతెన రహదారులు అత్యంత దుస్థితికి చేరినా పట్టించుకునే నాథులే కరువయ్యారు.

వరద.. మురుగు.. గోదారులు

◆ రెండు దశాబ్దాల క్రితం ఒకవైపు, పదేళ్ల క్రితం మరోవైపు ఒలిఫెంటా వంతెన మార్గాలను జీహెచ్‌ఎంసీ అధికారులు మరమ్మతులు చేశారు. దారి మార్గాలు మరమ్మతులు చేసినా వాటిని ఆవరించి ఉన్న మురుగు పారుదల వ్యవస్థను ఆధునీకరించని కారణంతో నిత్యం ఈ రెండు మార్గాలు మురుగునీటికి నిలయాలుగా మారుతున్నాయి.

◆ వంతెనదారులు భూమికి సమాంతరంగా లేకపోవడం, ప్రధాన రహదారికి పల్లంగా ఉన్నాయి. దీంతో సమీపంలో ధ్వంసమవుతున్న మ్యాన్‌హోళ్లు, నిండిపోతున్న మురుగునీటి కాల్వల నుంచి వెలుడుతున్న మురుగునీరు వంతెన దారుల్లోకి వచ్చి చేరుతోంది. వర్షాలు కురిసిన సందర్భాల్లో నిరాటంకంగా వర్షం నీరు మురుగునీరుకు తోడవుతోంది. దీంతో వంతెన మార్గాలు ఆసాంతం మురుగు, వరదనీటి గోదారులుగా మారుతున్నాయి.

నాలుగు మార్గాలకు ఇదే వంతెన..

◆ నాలుగు ప్రధాన రహదారుల నుంచి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చేరుకునే వాహనాలన్ని ఒలిఫెంటా వంతెన మీదుగా రావాల్సిందే. తార్నాక, చిలకలగూడ, ముషీరాబాద్, బోయిగూడ 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్ మీదుగా వచ్చే బస్సులు, ఇతర వాహనాలన్ని వంతెన దాటుకొని వెళ్లాల్సి వస్తుంది. నిత్యం అన్ని వేళల్లోనూ వాహనాలను అదుపు చేయడం ఈ ప్రాంత ట్రాఫిక్ పోలీసులకు తలకుమించిన భారంగా పరిణమిస్తుంది.

◆ వంతెన మార్గాల్లో రెండు పీట్ల ఎత్తు వరకు మురుగు, వరద నీటి నిల్వలు ఉంటుండడం, వంతెన దారులు మొత్తంగా గుంతలమయం కావడంతో వాహనదారులు వంతెన దాటడం కోసం ఇబ్బందులపాలవుతున్నారు. దీంతో వంతెన నుంచి సంగీత్, పద్మారావునగర్, ఆలుగడ్డబావి, చిలకలగూడ రైల్వే క్వార్టర్స్ కూడళ్ల వరకు ఉదయం సాయంత్రం వేళల్లో వాహనాలు బారులు తీరి, తీవ్రమైన ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి.

అసలు కారణం అధికారుల నిర్లక్ష్యం

◆ రహదారులను మరమ్మతు విషయంలో జీహెచ్‌ఎంసీ అధికారులు కొంత మేర దృష్టి సారిస్తున్నా డ్రైనేజీ కాల్వలు, మ్యాన్‌హోళ్ల విషయంలో మాత్రం అధికారులు తీవ్రంగా నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నారు. వంతెనను ఆవరించి ఉన్న మురుగునీటి కాల్వల్లో చేరుతున్నది రైల్వేకు చెందిన మురుగునీరని జీహెచ్‌ఎంసీ అధికారులు చెబుతున్నారు. రైల్వే అధికారులు మాత్రం ఇక్కడి మురుగునీటి కాల్వలు ఆధునీకరించడంలో ఎంతమాత్రం దృష్టిసారించడం లేదు. ఫలితంగా సమస్యలు దినదినం జటిలం అవుతున్నాయి. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ఇరు విభాగాల అధికారుల మధ్య సయోధ్య కుదిర్చి, సమస్యకు పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలి

రైల్వే జీఎం సంజయ్ కుమార్‌కు వినతిపత్రం అందజేత



రైల్ నిలయం ఎదుట నిరసన తెలుపుతున్న రైల్వే పెన్షనర్లు



రైల్వే జీఎం సంజయ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ నాయకులు

అడ్డగుట్ట: రైల్వే పెన్షనర్ల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వేమెన్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఎదుట ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పెన్షన్ బిల్లు చెల్లుబాటును రద్దు చేయాలన్నారు. 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని, పెన్షన్ ఒప్పంద కాలాన్ని 15 ఏళ్ల నుంచి 12 ఏళ్లకు తగ్గించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 18 నెలల డీఏ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవకు వినతిపత్రం సమర్పించారు. ఈ నిరసనలో ఏఐఆర్‌ఆర్‌ఎఫ్ నాయకులు యుగేందర్, శివకుమార్, సుధాకర్‌రావు, స్వామి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు స్టేకు కాంగ్రెస్ ప్రభుత్వమే కారణం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి ప్రసాద్‌గౌడ్

బౌద్ధనగర్: బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవి ప్రసాద్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం బౌద్ధనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. చిత్తశుద్ధి లేకుండా వ్యవహరించిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే ఈరోజు ఓబీసీలు ఎదుర్కొంటున్న దురవస్థకు కారణమని అన్నారు. బీసీలకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లి, న్యాయపరమైన లొసుగులను సరిచేసుకోవాలన్నారు. ఆగస్టు 31న అసెంబ్లీ ఆమోదించిన బిల్లును గవర్నర్‌కు పంపినప్పటికీ, గవర్నర్ నిర్ణయం తీసుకోవడానికి మూడు నెలల గడువు ముగియకముందే ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసిందని విమర్శించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం గవర్నర్‌కు పంపిన బిల్లులపై మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టంగా పేర్కొన్నప్పటికీ, ఆ గడువు పూర్తికాకముందే ప్రభుత్వం తొందరపడి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. బీజేపీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు పూర్తిగా మద్దతు ఇస్తూ దానికి కట్టుబడి ఉందన్నారు. మధ్యప్రదేశ్‌లో 57 శాతం రిజర్వేషన్ల కోసం బీజేపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పోరాడుతోంద వివరించారు. తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు కేవలం ఓట్ల కోసం, రాజకీయ స్వలాభం కోసం బీసీలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు.

మహిళలకు అన్ని విధాల రక్షణ కల్పిస్తున్నాం

షీటీమ్ ఏసీపీ ప్రసన్నలక్ష్మి



మాట్లాడుతున్న షీ టీమ్ ఏసీపీ ప్రసన్నలక్ష్మి

సికింద్రాబాద్: సమాజంలో ఎదురవుతున్న వేధింపుల నుంచి మహిళలకు అన్ని విధాల రక్షణ కల్పిస్తున్నామని సిటీ పోలీస్ షీటీమ్ విభాగం ఏసీపీ ప్రసన్నలక్ష్మి అన్నారు. శుక్రవారం సీతాఫల్‌మండి ఆర్యసమాజం వైదిక్ పాఠశాల ఆడిటోరియంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళల సదస్సును నిర్వహించారు. మహిళల్లో మనోధైర్యం నింపడం, తల్లులు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవడం కోసం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా షీ టీమ్ ఏసీపీ ప్రసన్నలక్ష్మి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ జే.స్వప్నలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. గృహ, సామాజిక పరమైన వేధింపులు, సమస్యలను మహిళలు ధైర్యంగా ఎదుర్కొనేందుకు షీటీమ్ పోలీసులను ఆశ్రయించాలన్నారు. మహిళలు ఒక్క ఫోన్‌కాల్ ద్వారా షీ టీం పోలీసుల తక్షణ సహాయాన్ని పొందవచ్చునని చెప్పారు. సమాజంలో మహిళలకు ఎదురయ్యే వేధింపులు, షీ టీంలను ఆశ్రయించే పద్ధతులపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ జే.స్వప్న మాట్లాడుతూ మహిళలు, గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టిక ఆహార పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, జాహ్నవి, హరిప్రియ, సంధ్య, తిరుమల, లక్ష్మి, రేణుక, ఎన్‌ఐఎన్ సైంటిస్టు సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

వేదాలతో సమాజానికి మేలు: మంత్రి సురేఖ



రజతోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

బన్సీలాల్‌పేట్: వేదాల వల్ల సమాజానికి ఎంతో మేలు జరగడంతో పాటు మానవ మనుగడ కూడా ఆధారపడి ఉందని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. సికింద్రాబాద్ పద్మారావునగర్‌లోని స్కందగిరి దేవాలయంలో ప్రాంగణంలో జరుగుతున్న శ్రీ జనార్దనానంద సరస్వతీ స్వామి సంస్కృతి ట్రస్ట్ రజతోత్సవ వేడుకలకు శుక్రవారం హాజరై మాట్లాడారు. పూజలు, వేదాల వల్ల సమాజానికి ఎంతో మంచి జరగడంతో పాటు ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారన్నారు. వేదాలను కాపాడుకొని భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ మాట్లాడుతూ రాష్ట్రంలో వేద పాఠశాల అభివృద్ధి, పరిరక్షణ కోసం ప్రభుత్వం తరఫున అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్‌రావు, తుని తపోవనం అధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతీ స్వామి, శ్రీ స్కందగిరి సుబ్రమణ్య స్వామి దేవాలయం చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి ఎల్వీ సుబ్రహ్మణ్యం, కృష్ణన్ రాజమణి, ట్రస్ట్ చైర్మెన్ తూములూరి సాయినాథ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతకు డాక్టరేట్



మానవతారాయ్

లాలాపేట: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మానవతారాయ్‌కి ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌ను ప్రకటించింది. హైదరాబాద్ రాష్ట్ర మొట్ట మొదటి, చిట్టచివరి ముఖ్యమంత్రి డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు జీవితం–సాహిత్యం అనే అంశంపై ప్రస్తుత సువవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య నిత్యానందరావు పర్యవేక్షణలో ఓయూ తెలుగు శాఖకు గ్రంథాన్ని సమర్పించారు. దీంతో ఓయూ పరీక్షల విభాగం ఈయనకు డాక్టరేట్‌ను అందజేసింది. ఖమ్మం జిల్లా కల్లూరుకి చెందిన మానవతారాయ్ తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారు.

మొబైల్ షాప్‌పై కేసు నమోదు

అమీర్‌పేట: ప్రముఖ బ్రాండ్‌ను పోలిన ఉత్పత్తులు విక్రయిస్తున్న ఓ మొబైల్ షాప్‌పై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీర్‌పేట వెల్లంకీ ఫుడ్స్ ఎదురుగా ఉన్న ఎం.ఎం. మొబైల్ షాపులో అంతర్జాతీయ బ్రాండ్ యాపిల్ కంపెనీని పోలిన నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తుండటంతో యాపిల్ కంపెనీ తరఫున ఎం.డీ. తౌకీర్, క్లిటిజ్ ఖర్బీ, మినాల్ అగర్వాల్ ఎస్‌ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మొబైల్ షాప్ నిర్వాహకులపై కాపీరైట్ చట్టం కింద కేసు నమోదు చేశారు. షాపులో నుంచి నకిలీ బ్రాండ్ ఉత్పత్తులు స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

సికింద్రాబాద్: ఆర్థిక సమస్యలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ కే.పండరి వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం బాదజ్‌హరాకు చెందిన సుషీల్‌కుమార్ సాహు (32) డెలివరీబాయ్‌గా పనిచేసేవాడు. ఉపాధి కోసం నగరానికి వచ్చి పలు చోట్ల వెదికినా సరైన ఉద్యోగం లభించలేదు. దీనికితోడు ఆర్థిక సమస్యలు పెరగడంతో జీవితంపై విరక్తి చెంది చర్లపల్లి–మౌలాలి రైల్వేస్టేషన్ల మధ్యలోని రైల్వే ట్రాక్ వద్దకు చేరుకొని వేగంగా వస్తున్న యశ్వంతాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఫైర్ మాక్‌డ్రిల్



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఫైర్ మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

సికింద్రాబాద్: రైల్వేస్టేషన్‌లో రైల్వే రక్షక దళం (ఆర్‌పీఎఫ్) పోలీసులు శుక్రవారం ఫైర్ మాక్ డ్రిల్, వర్క్‌షాప్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు జరిగే సందర్భాల్లో రైల్వే పోలీసులతో పాటు అన్ని విభాగాల ఉద్యోగులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండడంపై వర్క్‌షాప్ నిర్వహించారు. అనంతరం స్టేషన్‌తో పాటు పరిసరాల్లో సంభవించే అగ్ని ప్రమాదాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రయోగాత్మకంగా అధికారులు వివరించారు. అగ్నిమాపక యంత్రాలను వినియోగించడం, రైల్వే ఆస్తులను ప్రయాణికులకు కాపాడడం కోసం అప్రమత్తం కావాల్సిన తీరుపై కమ్మర్షియల్ సిబ్బంది, హాకర్లు, పోర్టర్లు, పారిశుద్ధ్య సిబ్బంది, డ్రైవర్లు తదితర విభాగాల సిబ్బందికి అవగాహన కల్గించారు. ఆర్‌పీఎఫ్ సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ బీఎస్ సారస్వత్, ఫైర్ ఆఫీసర్ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు ఎం.వెంకట్‌రెడ్డి, బి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంక్ బండ్‌పై సత్యనారాయణ విగ్రహం ఏర్పాటు చేయాలి



లాలాపేట: బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ వాగ్గేయకారుడు, మాజీ మంత్రి ముచ్చర్ల సత్యనారాయణ 9వ వర్ధంతిని శుక్రవారం ఆర్ట్స్ కళాశాల ఎదుట బీసీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సైదులు యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓయూలోని పలు విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొని సత్యనారాయణ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. 1952 నాన్ ముల్కి, ఇడ్లీ, సాంబార్ గో బ్యాక్ ఉద్యమం మొదలుకొని తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను తెలిపిన గొప్ప ఉద్యమ నాయకుడని కొనియాడారు. కవిగా, రచయితగా తెలంగాణలో జరుగుతున్న అన్యాయాలను తన పాటలు, పద్యాలతో కళ్లకుకట్టినట్లుగా ప్రజలకు చూపించిన ధీరశాలి అని అన్నారు. ఆయన జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో పెట్టాలని, విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బాలు, వలిగొండ నరసింహ, సైదులు, రవికుమార్, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



గాంధీఆస్పత్రి: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గాంధీ సైకియాట్రి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పలు అవగాహన కార్యక్రమాలు, చైతన్యర్యాలీ చేశారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర, సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణిలు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. శారీరక, మానసిక ఆరోగ్యం చాలా అవసరమన్నారు. ప్రతీ ఆరుగురిలో ఒకరు మానసిక ఇబ్బందికి గురవుతున్నారన్నారు. మానసిక ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, మద్యపానం, మాదకద్రవ్యాల వినియోగం వలన ఎక్కువ మంది మానసిక రుగ్మతలకు గురవుతున్నారని వివరించారు. యువతలో మొబైల్ అడిక్షన్, డిప్రెషన్, గ్యాంబ్లింగ్ తదితర వ్యసనాలు విపరీతంగా పెరిగి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం గాంధీ ప్రాంగణంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కరపత్రాన్ని ఆవిష్కరించారు. వైద్యవిద్యార్థులు ప్రదర్శించిన ఫ్లాష్‌మాబ్, నృత్యరూపకం ఆహుతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గాంధీ ప్రిన్సిపాల్ ఇందిర, సూపరింటెండెంట్ వాణి, గాంధీ సైకియాట్రి విభాగ ఇన్‌చార్జి హెచ్‌ఓడీ డాక్టర్ అనుపమ, వైస్ ప్రిన్సిపాల్స్ రవిశేఖరరావు, రాజారామ్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ హెచ్‌ఓడీ కేటీరెడ్డి, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ రోజారాణి, నర్సింగ్ సూపరింటెండెంట్స్ పద్మ, విద్యావతి, వైద్యులు, వైద్యవిద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

- టపాసులు దుకాణాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 'సాక్షి' ఇంటర్వ్యూలో సనత్‌నగర్ ఫైర్ ఆఫీసర్ పూర్ణకుమార్



సనత్‌నగర్: దీపావళి సందర్భంగా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, ఇప్పటికే ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైనట్లు సనత్‌నగర్ ఫైర్ ఆఫీసర్ పూర్ణకుమార్ స్పష్టం చేశారు. లైసెన్స్ పొందిన సమయంలో సూచించిన నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలని, లేనిపక్షంలో లైసెన్స్ రద్దు అవుతుందని పేర్కొన్నారు. దుకాణాల ఏర్పాటులో కూడా నిర్దేశించిన నియమ నిబంధనలు తప్పక అమలుచేయాల్సిందేనని 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రశ్న: దీపావళి టపాసుల దుకాణాల అనుమతి జారీ ప్రక్రియ ఏవిధంగా ఉంటుంది?

ఫైర్ ఆఫీసర్: టీఎస్ ఫైర్.కామ్ వెబ్‌సైట్‌లోకి వెళ్ళి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి తమకు విచారణ నిమిత్తం పంపిస్తారు. విచారణ అనంతరం నివేదికను తాము తిరిగి ఆన్‌లైన్‌లో పంపించడం జరుగుతుంది. తదనుగుణంగా అనుమతులకు సంబంధించిన లైసెన్స్ జారీ చేస్తారు.

ప్రశ్న: టపాసుల దుకాణాల ఏర్పాటు చేసుకోవాలంటే ఎలాంటి నిబంధనలు ఉంటాయి?

ఫైర్ ఆఫీసర్: ఖాళీ ప్రాంతంలోనే దుకాణాల ఏర్పాటుకు అనుమతి ఉంటుంది. ఒకవేళ షాపులో విక్రయాలు కొనసాగించాలనుకుంటే షాపు మాత్రమే సింగిల్‌గా ఉండాలి. అలాగే షాపుకు షాపుకు మధ్య కనీసం మూడు మీటర్ల దూరం ఉండాలి. జీఐ జింక్ షీట్లతోనే టపాసుల విక్రయ శాలలను నిర్మించుకోవాల్సి ఉంటుంది.

ప్రశ్న: విక్రయదారులు ప్రధానంగా ఏయే జాగ్రత్తలు పాటించాలి?

ఫైర్ ఆఫీసర్: ప్రతి విక్రయకేంద్రం వద్ద నో స్మోకింగ్ బోర్డులు ఏర్పాటుచేయాలి. ఫైర్ ఆర్పే పరికరాన్ని ఉంచుకోవాలి. ఒక బక్కెట్ ఇసుకను, కనీసం రెండు డ్రమ్ముల నీటిని అందుబాటులో ఉంచాలి. 24 గంటలు పర్యవేక్షించేలా వ్యక్తిని నియమించుకోవాలి. ఐఎస్ఐ ఎలక్ట్రికల్ వైరింగ్ మాత్రమే విద్యుత్ సరఫరాకు వాడాలి. స్టాక్ ఉంచిన మెటీరియల్స్ మధ్య ఒక మీటర్ దూరం ఉండాలి. అలాగే విక్రయ కేంద్రానికి వెంటిలేషన్ ఉండేలా చూసుకోవాలి. 18 ఏళ్ల లోపు వారిని షాపులో ఎంప్లాయ్‌మెంట్ కల్పించకూడదు. షాపుల వద్ద చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలి.

ప్రశ్న: మీ పరిధి ఎంతవరకు ఉంది?

ఫైర్ ఆఫీసర్: మూసాపేట వై జంక్షన్, అమీర్‌పేట్, బాలానగర్, బోరబండ, ఎర్రగడ్డ ప్రాంతాల వరకు మా పరిధి విస్తరించి ఉంది. ఈ ప్రాంతాల్లో టపాసుల దుకాణాలు ఏర్పాటుచేసుకునే వారి అనుమతులకు సంబంధించి నివేదికను పంపిస్తాం.

ప్రశ్న: అత్యవసర పరిస్థితుల్లో ఎవరిని సంప్రదించాల్సి ఉంటుంది?

ఫైర్ ఆఫీసర్: షాపుల వద్ద గానీ, లేదా ఇళ్ల వద్ద టపాసులు కాల్చే సమయంలో ఏ చిన్న అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే 101కు గానీ, కంట్రోల్ రూమ్ నెంబర్లు 87126 99444/464కు ఫోన్ చేయవచ్చు.